నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, మంగళవారం 23 జనవరి 2024 | MAHABUBNAGAR NARAYANPET



శిరుసనగండ్లలో సీతారామచంద్రస్వామి కల్యాణోత్సవంని ర్వహిస్తున్న అర్చకులు

## కల్యాణం.. కమనీయం

చారకొండ, జనవరి 22 : అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకొని రెండో భద్రాదిగా పేరుగాంచిన శిరుసనగండ్ల సీతారామచంద్రస్వామి ఆలయంలో సోమవారం స్వామివారి కల్యాణం నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య రామనామస్మరణలతో వేడుక అట్టహాసంగా జరిగింది. మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయంలో స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆలయం నుంచి వివిధ గ్రామాల్లో శోభాయాత్ర ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రామశర్మ, ఈవో రఘు, సర్పంచ్ శారద, ఎంపీటీసీ లక్ష్మణ్‌నాయక్, మాజీ ఎంపీటీసీ నర్సింహారెడ్డి, రమ్య, ఎంఈవో శంకర్‌నాయక్, అర్చకులు లక్ష్మణ్‌శర్మ, మురళీశర్మ, ప్రవీణ్‌శర్మ ఉన్నారు.



పుల్లూరులో ఉత్సవ విగ్రహాలనుకల్యాణ వేదిక వద్దకు తీసుకొస్తున్న ఎమ్మెల్యే విజయుడు

## పట్టువస్త్రాల సమర్పణ

ఉండవెల్లి, జనవరి 22 : మండలంలోని పుల్లూరులోని సీతారామాలయంలో స్వామివారిని సోమవారం ఎమ్మెల్యే విజయుడు దర్శించుకొని పూజలు చేశారు. వేందపండితులు అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ఆలయంలో ఉదయం గణపతిపూజ, పుణ్యాహవచనం, బిందెసేవ, రాములవారికి పంచామృతాభిషేకం, మహామంగళహారతి వంటి విశిష్ట పూజలు నిర్వహించారు. సీతారాముల ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎమ్మెల్యే చేతుల మీదుగా వేదపండితులు సీతారాముల కల్యాణం జరిపించారు. కల్యాణాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను అందించి అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ నారాయణమ్మ, పీఏసీసీఎస్ చైర్మన్ గజేందర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



క్రిటికల్ కేర్ భవన నిర్మాణానికిభూ మి పూజ చేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

## ఎమర్జెన్సీ ట్రీట్‌మెంట్‌కే క్రిటికల్ కేర్

- గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల, జనవరి 22 : ప్రాణాపాయ స్థితిలో చికిత్స అందించేందుకు క్రిటికల్ కేర్ బ్లాక్ దోహదం చేస్తుందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని 300 పడకల దవాఖాన సమీపంలో ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి చికిత్స అందించేందుకు రూ.27.75 కోట్లతో మంజూరైన క్రిటికల్ కేర్ బ్లాక్ భవన నిర్మాణానికి మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్‌తో కలిసి సోమవారం ఎమ్మెల్యే భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్రం మానవ సేవే.మాధవ సేవలో భాగంగా జోగుళాంబ గద్వాల జిల్లాకు క్రిటికల్ కేర్ బ్లాక్‌ను మంజూరు చేసిందన్నారు. రోడ్డుప్రమాదంలో గాయపడడం, పాముకాటు వంటి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తులకు అత్యవసర చికిత్స అందించడానికి ఇది ఎంతగానో ఉపయోగ పడుతుందని తెలిపారు. త్వరలో దీని నిర్మాణ పనులు పూర్తి చేసి అన్ని రకాల సదుపాయాలతో అందుబాటులోకి తెస్తామన్నారు. కాంట్రాక్టర్లు పనులు నాణ్యతతో త్వరలో పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం అక్కడే నిర్మాణం జరుగుతున్న నర్సింగ్ కళాశాల వసతి గృహ నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రతాప్‌గౌడ్, వైస్ చైర్మన్ బాబర్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

***నెరవేరిన శతాబ్దాల కల..***

అయోధ్యలో రామాలయ నిర్మాణం ప్రజల శతాబ్దాల కల అని అది ప్రస్తుతం నెరవేరిందని, బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. అయోధ్యలో రామమందిర ప్రారంభోత్సవ సందర్భంగా జిల్లా కేంద్రంలోని రాంనగర్‌లో ఉన్న రామాలయం, కాళిమాత ఆలయాల్లో ఎమ్మెల్యే పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు శతాబ్దాల భారతీయుల సుందర స్వప్నం నేడు సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కేశవ్, ఎంపీపీ విజయ్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీధర్‌గౌడ్ ఉన్నారు.



విద్యార్థినులను అభినందిస్తున్న కరాటే అకాడమీ నిర్వాహకులు

## నలుగురు విద్యార్థినులకు స్వర్ణ పతకాలు

వనపర్తి టౌన్, జనవరి 22 : ఖేలో ఇండియా కిక్ బాక్సింగ్ ఉమెన్స్ లీగ్‌లో వనపర్తికి చెందిన విద్యార్థినులు నాలుగు స్వర్ణ పతకాలను సాధించినట్లు గుజారియో కరాటే కిక్ బాక్సింగ్ అకాడమీ నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 20, 21వ తేదీల్లో హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో ఖేలో కిక్ బాక్సింగ్ ఉమెన్స్ లీగ్ నిర్వహించగా.. 37 కేజీల విభాగంలో అనన్య, 42 కేజీల విభాగంలో ఝాన్సీ, 46 కేజీల విభాగంలో రేణుక, 55 కేజీల విభాగంలో కీర్తనలు స్వర్ణ పతకాలు సాధించారన్నారు. వీరికి ఐఏఎస్ అధికారులు లక్ష్మి, అనిత, ఖేలో ఇండియా కన్వీనర్ జగదీశ్‌యాదవ్ బహుమతులు అందజేశారు. కాగా, విద్యార్థినులను అకాడమీ నిర్వాహకులు సోమవారం అభినందించారు. కార్యక్రమంలో కిక్ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు, కార్యదర్శి మహిపాల్, ఉపాధ్యక్షులు శేఖర్, సీనియర్ విద్యార్థులు శివకృష్ణయాదవ్, వరుణ్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

### తండ్రిని హతమార్చిన కొడుకు

వనపర్తి, జనవరి 22 : మద్యం మత్తులో తండ్రిని కొడుకు హతమార్చిన ఘటన వనపర్తి మండలంలోని చిమనగుంటపల్లిలో సోమవారం చోటుచేసుకున్నది. సీఐ మహేశ్వర్‌రావు కథనం మేరకు.. గ్రామానికి చెందిన తెలుగు బచ్చన్న (85)కు ముగ్గురు కుమారులు. వారిలో పెద్ద కొడుకు కురుమన్న మద్యం మత్తులో సోమవారం ఉదయం భార్య లక్ష్మిని కొట్టడంతో రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కాగా, మధ్యాహ్నం మళ్లీ ఫుల్లుగా తాగి వచ్చి ఇంట్లో ఎవరూ లేని సమయంలో తండ్రిపై గొడ్డలితో దాడి చేయగా అక్కడిక్కడే మృతిచెందాడు. చుట్టుపక్కల వారు కురుమన్నను పట్టుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ ఘటనా స్థలానికి చేరుకొని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.




వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణంలో నిర్వహించిన శోభాయాత్రలో మహిళల కోలాట ప్రదర్శన



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో చిన్నారుల నృత్యప్రదర్శన

- ఉమ్మడి జిల్లాలో బాలరాముడి పండుగ
- భారీ సైజ్ డిజిటల్ స్క్రీన్ల ప్రదర్శన
- పట్టాభి రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ వీక్షణ



# రామ్ సియా రామ్

- వేడుక తిలకించి ప్రజల తన్మయత్వం
- ఊరూరా శ్రీరాముడి శోభాయాత్రలు
- భక్తులతో కిక్కిరిసిన రామాలయాలు
- మార్మోగిన జైశ్రీరాం నామస్మరణ

*ఇంటింటా రామనామం.. ఊరూరా శోభాయాత్రలు.. వీధుల్లో జైశ్రీరాం నినాదాల జోరు.. యువత మోటర్ సైకిళ్ల ర్యాలీలు.. మహిళల కోలాటాల ప్రదర్శన.. ఇండ్ల ముంగిళ్లలో అలరించిన రంగవల్లులు.. కిక్కిరిసిన ఆలయాలు.. రామాలయాల్లో విశేష పూజలు.. వీధివీధినా అన్నదానాలు.. ఆకట్టుకునేలా చిన్నారుల వేషధారణ.. ఇలా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆధ్యాత్మిక పరిమళాలు విరజిమ్మాయి. సోమవారం అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా రామనామం మార్మోగింది. రామలల్లా ప్రాణప్రతిష్ఠ జరగగానే ప్రజలందరూ కరతాళ ధ్వనులతో సంతోషాన్ని వెలిబుచ్చారు. పెద్ద సైజ్‌లో డిజిటల్ స్క్రీన్లల్లో పట్టాభి రాముడి వేడుకను తిలకించిన ప్రజలు తన్మయత్వం పొందారు. జై శ్రీరామ్ నినాదాలతో, పటాకుల మోతతో హోరెత్తిపోయింది. ఎక్కడ చూసినా అయోధ్య పండుగ సందడే కనిపించింది.*








మరికల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజలు, గద్వాలలోని పాండురంగ స్వామి ఆలయంలో రామబాణం, జైశ్రీరామ్ నమూనాలో దీపాలు వెలిగించిన భక్తులు, గద్వాలలో మంగళహారతులతో మహిళా భక్తుల ర్యాలీ








పెబ్బేరులో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న భక్తులు, నారాయణపేటలో సీతారాములు, లక్ష్మణుడు, ఆంజనేయస్వామి వేషధారణలో చిన్నారులు, నారాయణపేటలో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న చిన్నారులు

# నిద్రావస్థలో నిఘా ?

- వనపర్తి జిల్లాలో పనిచేయని 397 సీసీ కెమెరాలు
- రోజురోజుకూ పెరుగుతున్న చోరీలు
- కొరవడుతున్న పోలీస్ పర్యవేక్షణ
- జిల్లా కేంద్రంలోనూ అదే పరిస్థితి..

వనపర్తి, జనవరి 22 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో చోరీలు.. నేరాల సంఖ్యను తగ్గించాలని రెండేండ్ల కిందట ఆగమేఘాల మీద ఏర్పాటు చేసిన నిఘా నేత్రాలు నిమ్మకుండిపోయాయి. పట్టణాలు, గ్రామాలు తేడా లేకుండా చాలా చోట్ల వీటిని ఏర్పాటు చేశారు. ప్రధానంగా పోలీసుల ప్రోద్బలంతో ఆయా మండలాల్లోని ప్రజాప్రతినిధులు స్వచ్ఛందంగా ముందుకు రావడంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ కెమెరాల వ్యవస్థ పూర్తిగా మూలన పడడంతో ప్రజాప్రతినిధులు, కొందరు దాతలు చేసిన సహకారమంతా బూడిదలో పోసిన పన్నీరైంది. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులకు సమానం అన్న సూక్తిని పలు సందర్భాల్లో పోలీసు అధికారులు వల్లించినా ఆచరణలో సరైన పర్యవేక్షణ లేక పోవడంతో నిఘా వ్యవస్థ అంతా అస్తవ్యస్తంగా మారింది.

***జిల్లాలో 794 సీసీ కెమెరాలుంటే..***

వనపర్తి జిల్లాలో 794 సీసీ కెమెరాలుండగా.. 397 పనిచేస్తున్నట్లు జిల్లా పోలీసు కార్యాలయంలో లెక్క ఉన్నది. అంటే మరో 397 కెమెరాలు పనిచేయడం లేదని పోలీసుల అధికారులే చెబుతున్నారు. ఇంకా దగ్గరకు వెళ్లి చూస్తే మరికొన్ని కెమెరాలు కూడా పనిచేయడం లేదని తెలుస్తున్నది. ఇదిలా ఉంటే స్థానికంగా ఉండే పోలీసు అధికారులు వీటి ఏర్పాటులో అప్పట్లో కీలకంగా వ్యవహరించారు. ఆయా మండలాల్లోని ప్రజాప్రతినిధుల సహకారంతో భారీగా డబ్బుల సేకరణ జరిగింది. ఇలా అనేక గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఏర్పాటైన తొలిరోజుల్లో కొంత వరకు బాగానే పని చేశాయి. కొన్ని చోరీలు సహితం ఈ కెమెరాల వల్ల పోలీసు అధికారులు ఛేదించగలిగారు. ప్రారంభంలో కొంత ఊరటనిచ్చినప్పటికీ పర్యవేక్షణ లేకపోవడంతో నిఘా వ్యవస్థ మూలన చేరింది. చిన్నచిన్న లోపాలతో కెమెరాలు పనిచేయడం లేదు, సీసీ కెమెరాలు పనిచేయడం లేదని తెలిసినా పోలీసు అధికారులు వాటికి మరమ్మతులు కూడా చేయించడం లేదు. వీటిని ఏర్పాటు చేయించడంలో ఉన్న శ్రద్ధ పని చేయించడంపై దృష్టి పెట్టడం లేదని చందాలు ఇచ్చిన దాతలు, పలువురు ప్రజాప్రతినిధులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఎంతో సదుద్దేశంతో లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన నిఘా వ్యవస్థ మూణ్నాళ్ల ముచ్చటగా మారిందని పలువురు ఆరోపిస్తున్నారు.

***జిల్లా కేంద్రంలోనూ అంతంత మాత్రమే..***

మారుమూల గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల సంగతి అటుంచితే.. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసినవి కూడా అంతంత మాత్రంగానే పనిచేస్తున్నట్లు తెలుస్తున్నది. 63 కెమెరాల కోసం రూ.లక్షల్లో విరాళాలను సేకరించారు. అయితే నాణ్యమైన కెమెరాలను ఏర్పాటు చేయలేదన్న విమర్శలు కూడా అప్పట్లో వెలువడ్డాయి. అందువల్లే కెమెరాలు సక్రమంగా పనిచేయడం లేదని, తక్కువ దూరంలోనే కెమెరాల్లో వీడియోలు నమోదు అవుతున్నట్లుగా గుర్తించారు. గ్రామాల్లోని కెమెరాలు పని చేయకపోయినా కనీసం జిల్లా కేంద్రంలోనైనా నిఘా వ్యవస్థను పటిష్టంగా అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

***పెరుగుతున్న చోరీలు..***

జిల్లాలో చోరీల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. రోజూ ఏదో ప్రాంతంలో చోరీలు జరుగుతూనే ఉన్నాయి. వీటిలో కొన్ని మాత్రమే కేసులు నమోదవుతుండగా, మరికొన్ని కేసుల వరకు రావడం లేదు. పగలు.. రాత్రి తేడా లేకుండా చోరీలు జరుగుతున్నాయి. వీటిలో కొన్ని పోలీసులు ఛేదిస్తుండగా, మరికొన్ని విచారణ స్థాయిలోనే కొనసాగుతున్నాయి. కొత్తకోట, అమరచింత, పెబ్బేరు, పాన్‌గల్ ప్రాంతాల్లో చోరీ కేసులు నమోదైన సంగతి తెలిసిందే. ఇలా జిల్లాలో ఇంకా మరికొన్ని చోట్ల జరిగిన చోరీలు కేసుల నమోదు వరకు రాకుండానే వెనుతిరుగుతున్నాయి. చోరీ కేసులు నమోదైతే అక్కడి అధికారులపై అధిక ఒత్తిడి పడుతుందని, కొన్ని చోరీలను దరఖాస్తుల వరకే పరిమితం చేస్తున్నట్లుగా తెలుస్తుంది.

***పెట్రోలింగ్ పెరగాలి..***

చోరీలు పెరుగుతున్నందున రాత్రిళ్లు పోలీసు పెట్రోలింగ్‌ను పెంచాలన్న అభిప్రాయం జిల్లా వ్యాప్తంగా వ్యక్తమవుతున్నది. జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయం నుంచి పెట్రోలింగ్ డ్యూటీలు నెల ముందే ఖరారవుతాయి. రాత్రి వేళల్లో మూడు షిఫ్ట్‌ల వారీగా పెట్రోలింగ్‌ను ఏర్పాటు చేస్తారు. అయితే ఈ వ్యవస్థ పటిష్టంగా అమలు కావడం లేదన్న విమర్శలున్నాయి. పెట్రోలింగ్ చేసే అధికారులు ప్రధాన కూడళ్లు, ఇతర ముఖ్యమైన ప్రదేశాల నుంచి ఫొటోలు దిగడం వరకే ప్రాధాన్యతనిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.



గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

**వనపర్తి జిల్లాలో సీసీ కెమెరాల వివరాలు..**

| మండలం | సీసీ కెమెరాలు | పని చేస్తున్నవి | పని చేయనివి |
|---|---|---|---|
| చిన్నంబావి | 60 | 30 | 30 |
| రేవల్లి | 04 | 4 | – |
| గోపాల్‌పేట | 70 | 43 | 27 |
| పాన్‌గల్ | 62 | 22 | 40 |
| వనపర్తి టౌన్ | 63 | 51 | 12 |
| వనపర్తి రూరల్ | 155 | 32 | 123 |
| కొత్తకోట | 82 | 58 | 24 |
| శ్రీరంగాపురం | 53 | 30 | 23 |
| పెబ్బేరు | 53 | 02 | 51 |
| మదనాపురం | 32 | 22 | 10 |
| ఆత్మకూరు | 30 | 21 | 09 |
| అమరచింత | 27 | 04 | 23 |
| పెద్దమందడి | 58 | 46 | 12 |
| ఖిల్లాఘణపురం | 45 | 32 | 13 |
| **మొత్తం** | **794** | **397** | **397** |



*చిన్నంబావి మండలంలో 60 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటిలో ఒక్క కొప్పునూరు గ్రామంలోనే 30 కెమెరాలున్నాయి. వీటిలో 5 కెమెరాలు మాత్రమే గ్రామపంచాయతీలోని డిస్‌ప్లే మీద పని చేస్తున్నాయి. మిగతా 20 కెమెరాలు పని చేయడం లేదు. మరో 5 కెమెరాల ఆనవాలు కూడా డిస్‌ప్లేలో చూపించడం లేదు. స్థానిక అధికారులను అడిగితే 25 పనిచేస్తున్నాయి. ఐదు మాత్రమే పని చేయడం లేదని చెబుతున్నారు. వాస్తవ పరిస్థితికి, చెప్పేదానికి అసలు పొంతనే లేదు. దీనిని బట్టి జిల్లాలో పనిచేస్తున్నాయని చెబుతున్నా.. వాటిలోఅనే కంప నిచేయడంలే దన్నట్లుగానేతె లుస్తున్నది.*